క్లుప్తంగా

16న వరలక్ష్మి వ్రతం

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరు రోడ్డులోని యోగభోగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16వ తేదీన సామూహిక వరలక్ష్మివ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 12 గంటలకు వ్రతం ప్రారంభించం జరుగుతుందన్నారు. వ్రతంలో పాల్గొనే మహిళలు ముందుగా ఆలయంలో సంప్రదించాలన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

ములకలచెరువు: మండల తహసీల్దార్‌గా నియమితులైన కే.ప్రదీప్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన గతంలో కలకడ మండలంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అందరి సహకారంతో మండలంలోని రైతాంగ సంస్యలను పరిష్కరించే దిశగా చొరవ చూపుతామన్నారు.

వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

పీలేరు : ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణి కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మాల మహానాడు నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ భీమేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ద్వారా వచ్చిన తీర్పు కేవలం కేంద్ర ప్రభుత్వం, బీజేపీ దురాలోచనతో కులాల మధ్య చిచ్చుపెడుతోందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మనాక్‌కు హాజరు కావాలి

మదనపల్లె సిటీ: ఇన్‌స్పైర్ మనాక్ ఒరియంటేషన్‌కు గైడ్ టీచర్లు హాజరు కావాలని జిల్లా సైన్సు అధికారి మార్లు ఓబుల్‌రెడ్డి, డివిజన్ రిసోర్సుపర్సన్ ఎం.భాస్కరన్ తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే కార్యక్రమానికి డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, డీవైఈఓ పురుషోత్తం హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమానికి నిమ్మనపల్లె, రామసముద్రం, మదనపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, గుర్రంకొండ, ములకలచెరువు, పిటీఎం, తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాలకు చెందిన గైడ్ టీచర్లు హాజరు కావాలని కోరారు.

'మిట్స్'కు అరుదైన గుర్తింపు

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు అరుదైన గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో అత్యుత్తమ విద్యా సంస్థల జాబితాను కేంద్ర విద్యా శాఖ తాజాగా విడుదల చేసిందన్నారు. ఇందులో 201 నుంచి 300 స్థానం కళాశాలగా మిట్స్ కళాశాలకు గుర్తింపు లభించిందని తెలిపారు. కళాశాల అందిస్తున్న విద్యా బోధన, నాణ్యతా ప్రమాణాలు, సౌకర్యాలు ఆధారంగా ఈ గుర్తింపును కేంద్రం ప్రకటించిందని తెలిపారు.

ఆదర్శ డిపోగా తీర్చిదిద్దాలి



ఉత్తమ డ్రైవర్ కృష్ణయ్యకు నగదు అవార్డు అందజేస్తున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించి ఆదర్శ డిపోగా తీర్చిదిద్దాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. అందరూ కలిసి కష్టపడి పని చేయడం వల్ల రీజియన్ స్థాయిలో మొదటి స్థానం నిలిచిందన్నారు. ఆదాయం పెంచి డిపో అభివృద్ధికి చేయూతనివ్వాలన్నారు. డీజిల్ పొదుపులో డ్రైవర్లు బి.జె.నాయక్, కృష్ణయ్య, టార్గెట్ ఆదాయంలో మొదటి స్థానం అమరావతి, బి.కృష్ణ, ఆంజనేయులు, ప్రొడక్ట్‌వైజ్‌లో అత్యధిక ఈపీకే సాధించిన సూపర్ లగ్జరీలో ఎ.హెచ్.క్రిష్ణ, ఎక్స్‌ప్రెస్‌లో వి.వి.రమణ, పల్లెవెలుగులో చంద్రకళ, గ్యారేజ్‌లో టైర్ మెకానిక్ బాలకృష్ణలకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

కలకడ /తంబళ్లపల్లె/ రామసముద్రం: గ్రామాలలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతోనే రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పని కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. తంబళ్లపల్లెలో రెవెన్యూ సమస్యలపై వీఆర్‌ఓలు వెంటనే స్పందించి పరిష్కరించేదుకు చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ హరిప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రామసముద్రం మండలంలో ఈనెల 16 నుంచి సెప్టెంబర్ 27 వరకు గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ నిర్మలాదేవి తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు రెవెన్యూ సదస్సులకు తప్పక హాజరుకావాలన్నారు.

అంబరమంటిన స్వాతంత్య్ర సంబరం



మదనపల్లె: అనిబిసెంట్ సర్కిల్‌లో జాతీయ జెండా ప్రదర్శన



పీలేరులో జాతీయజెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

- మదనపల్లెలో మెరిసిన మువ్వన్నెల జెండా
- ముందస్తు స్వాతంత్య్రదినోత్సవ వేడుకల్లో మెగా ర్యాలీ
- త్రివర్ణమయంగా మారిన పురవీధులు
- ఆరువేల మంది విద్యార్థులతో భారీ ప్రదర్శన

మదనపల్లె : మదనపల్లెలో స్వాతంత్య్ర దినోత్సవ ముందస్తు వేడుకలు అంబరాన్ని తాకుతున్నాయి. స్వాతంత్య్రదినోత్సవ కమిటీ–2024 ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహిస్తున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో రెండో రోజైన మంగళవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హైస్కూల్ విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మిషన్ కాంపౌండ్‌లో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన పాఠశాల విద్యార్థుల మెగా ర్యాలీకి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి ముందుకు సాగారు. దారి పొడవునా భారత్ మాతా కీ జై, ఇంక్విలాబ్ జిందాబాద్, మేరా భారత్ మహాన్ అంటూ విద్యార్థులు చేసిన నినాదాలు హోరెత్తాయి. జాతీయ జెండాతో కూడిన టీషర్ట్‌లను ధరించి, స్వాతంత్య్ర సమరయోధుల ఫొటోలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ, జాతీయ జెండా రెపరెపలతో ఆరువేల మంది విద్యార్థులకు పైగా సాగిన ర్యాలీతో పట్టణమంతా త్రివర్ణమయంగా కనిపించింది. మిషన్ కాంపౌండ్ నుంచి బయలుదేరిన ర్యాలీ సబ్ కలెక్టరేట్, చిత్తూరుబస్టాండ్, టౌన్‌బ్యాంక్ సర్కిల్, అవెన్యూరోడ్, బెంగళూరు బస్టాండ్ వరకు సాగింది. అక్కడ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా విద్యార్థులతో కలిసి జాతీయగీతం జనగణమణ ఆలపించారు. తర్వాత అక్కడి నుంచి బయలుదేరి అనిబిసెంట్ సర్కిల్‌కు చేరుకున్నారు. అనిబిసెంట్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ.. దేశ స్వాతంత్య్రం కోసం పోరాటంలో అమరులైన త్యాగశీలులను స్మరించుకుంటూ.. వారి త్యాగఫలితమే నేడు భారతదేశం స్వతంత్ర్యదేశంగా అవతరించిందని నేటి తరానికి తెలియజేసేందుకే మూడురోజుల ముందస్తు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. స్వాతంత్య్రోద్యమంలో మదనపల్లె నుంచి ఎందరో దేశభక్తులు పాల్గొని, జైలుకు వెళ్లారన్నారు. అంతేకాకుండా బీటీ కళాశాల స్థాపకురాలు అనిబిసెంట్ ఇక్కడి నుంచే హోంరూల్ లీగ్ ఉద్యమానికి నాయకత్వం వహించడం, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జాతీయ గీతం జనగణమణను బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి అనువదించడం, మార్గరెట్ కజిన్స్ బాణీలు కట్టడం, మహాత్మాగాంధీజీ విరాళాల సేకరణకు మదనపల్లెకు రావడం తదితర అనేక ఘట్టాలు మదనపల్లెతో ముడిపడి ఉన్నాయన్నారు. ఈ విశేషాలన్నింటినీ పిల్లలకు తెలపడమే కాకుండా అందరిలోనూ స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని రగిలించడమే ముందస్తు వేడుకల నిర్వహణ ప్రధాన ఉద్దేశమన్నారు. అలాగే బుధవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గవ్యాప్తంగా డ్వాక్రా,వెలుగు, మెప్మా మహిళాసంఘాల సభ్యురాళ్లతో మహా మెగా ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ వేడుకలకు పట్టణ ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ డి.కొండయ్యనాయుడు, డాక్టర్. రాటకొండ గురుప్రసాద్, విజయభారతి సేతు, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, రఘునాథరెడ్డి, ప్రసాద్, నాదెళ్ల విద్యాసాగర్, పోర్డ్ లలితమ్మ, వైఎస్.మునిరత్నం, పీటీఎం.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో ర్యాలీ

రామసముద్రం: రామసముఏద్రం మండల కేంద్రంలో ముందుస్తు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ తూర్పు ఎంపీపీ పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాఠశాల నుంచి ఎగువ చెక్‌పోస్టు మీదుగా అంబేడ్కర్ సర్కిల్ వరకు వందేమాతరం నినాదాలు చేశారు. అంబేడ్కర్ కూడలిలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మలాదేవి, మండల పరిపాలన అధికారి రమణ, ఎంఈఓ హేమలత, హెచ్‌ఎంలు హేమలత, చిట్టిబాబు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలోని ప్రభుత్వ స్కూళ్ళ విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. రానున్న స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగ కార్యక్రమంపై స్థానిక బస్టాండ్‌లో విద్యార్థులు, మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు కలసి ఇంటింటిపై జాతీయ జెండాను ఎగుర వేయాలని ప్రజలకు సూచించారు.

మువ్వెన్నెల జెండాతో ర్యాలీ

పెద్దమండ్యం: మండలంలోని కలిచెర్ల జూనియర్ కళాశాలలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలలో భాగంగా మంగళవారం అధికారులు, విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి కలిచెర్ల పురవీధులలో వందేమాతరం నినాదాలతో హోరెత్తించారు. మువ్వెన్నెల జెండాతో విద్యార్థులు, అధికారుల ర్యాలీతో కలిచెర్లలో పండుగ వాతావరణం నెలకొంది. బస్టాండు కూడలిలో ఈవోపీఆర్‌డీ శ్రీధర్‌రావు మాట్లాడారు. హర్‌ఘర్‌తిరంగా కార్యక్రమాన్ని అందరు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపైన మువ్వెన్నెల జెండా ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో- 2 రామక్రిష్ణ, పంచాయతీ కార్యదర్శులు పెనుగొండ జగన్‌మోహన్, జనార్ధన, ఉపాధ్యాయులు సోముశేఖరరెడ్డి, కళాశాల అధ్యాపకులు రవీంద్ర, వెంకటనరసయ్య, జావీద్,ముస్తఫా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

వాల్మీకిపురం: వాల్మీకిపురంలో మంగళవారం హర్ ఘర్ తిరంఘా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. స్థానిక పివిసి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయ జెండాలు చేతపట్టి పట్టణ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా విద్యార్థులతో పాటు ప్రజల హృదయాలలో దేశభక్తి భావాన్ని పెంపొందించడానికి హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని పాఠశాలలో ఘనంగా నిర్వహించినట్లు హెచ్‌ఎం సావిత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 15వ తేది వరకు భారతదేశ స్వాతంత్రానికి గుర్తుగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని ప్రధానమంత్రి సూచించారన్నారు. అలాగే విద్యార్థులు, ప్రజలు త్రివర్ణ పతాకంతో దిగిన సెల్ఫీలను హర్ ఘర్ తిరంగా వైబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలి

పీలేరు : స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయజెండా రెపరెపలాడాలని తహసీల్దార్ భీమేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం హర్ ఘర్ తిరంగా అంశంపై విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశ సమైక్యతను చాటి చెప్పేవిధంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, ఎస్‌ఐ బాలకృష్ణ, ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







వాల్మీకిపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, పెద్దమండ్యం: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు, రామసముద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



మదనపల్లె: విద్యార్థులతో కలిసి జనగణమణ ఆలపిస్తున్న దృశ్యం



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే , నాయకులు, ప్రజలు తదితరులు

రీ సర్వే పక్కాగా నిర్వహించాలి

–సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

తంబళ్లపల్లె: మండలంలోని ఫ్రీ హోల్డ్ అసైన్‌మెంట్ భూముల రీసర్వే పక్కాగా నిర్వహించి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం పరసతోపు పంచాయతీ ఏటిగడ్డపల్లె వద్ద సర్వే నంబర్ 1174 లోని ఐదు ఎకరా అసైన్‌మెంట్ భూమిని పరిశీలించారు. రైతులతో చర్చించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఉద్యోగుల పనితీరు సమస్యలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. విధినిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవన్నారు.



తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

అవయవదానంతో కొత్త జీవితం

కురబలకోట: మనిషి చనిపోతే వెంట ఎవ్వరూ వెళ్లలేరు..దేహం మట్టిలో కలిసిపోతుంది..అలా కాకుండా అవసరమైన వారికి సకాలంలో ఆమనిషి అవయవాలను దానం చేస్తే ఎనిమిది మందికి కొత్త జీవితాన్ని ఇవ్వొచ్చని తిరుపతి వెంకట పద్మావతి ఫిజియోథెరపీ కళాశాల అసోషియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. శ్వేత అన్నారు. అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. అన్నదానం వల్ల ఒక పూట కడుపు నిండుతుందన్నారు. అదే అవయవదానం వల్ల కొన్ని కుటుంబాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. ఒక వ్యక్తి అవయవదానం వల్ల ఎనిమిది మందికి కొత్త జీవితాన్ని ఇవ్వచ్చన్న విషయం చాలా మందికి తెలియదన్నారు. పురాణాలు ఇతిహాసాల ప్రకారం ఆత్మకు మరణం లేదని, ఒక శరీరానికి మాత్రమే మరణం ఉంటుందన్నారు. నిర్ణీత సమయంలోగా ముఖ్యంగా బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి గుండె, కళ్లు, కిడ్నీలు, లివర్, ప్రాంకియాస్, చిన్నపేగు, చర్మం, కార్నియా, ఎముక కణజాలం, గుండె కవాటాలు,రక్త నాళాలు వంటివి దానం చేయవచ్చన్నారు. అవసరం ఆపై సత్ ప్రవర్తన కల్గిన వారికి అమర్చడం వల్ల వారికి పునర్జన్మ ఇచ్చినట్లు కాగలదన్నారు. ప్రపంచంలో అన్ని దానాల కన్నా ప్రాణ దానం గొప్పదన్నారు. అయితే ప్రాణ దానం చెయ్యడానికి ఎవ్వరూ ముందుకు రారన్నారు. వివిధ కారణాల వల్ల ప్రాణం పోతున్న వారికి అవయవాలను దానం చేయడం ద్వారా వారి ప్రాణాన్ని పదిలపరచవచ్చన్నారు. అవయవదానమంటే ఒక రకంగా మరణాన్ని గెలవడమేనన్నారు. అవయవదానం గొప్పతనంపై కూడా ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం, ఆవశ్యకత ఉందన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎం. శ్వేత

ఈ- క్రాప్ నమోదు చేయించండి

– ఏడీఏ శివశంకర్

నిమ్మనపల్లె : రైతులు పండించిన పంటల వివరాలను ఈ- క్రాప్ లో తప్పనిసరిగా నమోదు చేయించాలని మదనపల్లి ఏడీఏ శివశంకర్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని నిమ్మలపల్లె పంచాయతీలో వేరుశనగ, వరి పొలాలను వ్యవసాయ అధికారి మురళీమోహన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు సంబంధిత సచివాలయాల్లో వ్యవసాయ సహాయకులకు తాము పండిస్తున్న పంటల వివరాలను తెలియజేసి, ఈ క్రాప్ లో నమోదు చేయించుకోవాలన్నారు. పంటల బీమా తో పాటు ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలను అందిపుచ్చుకోవచ్చున్నారు. ప్రస్తుతం రైతులు ప్రధానంగా వరి నాట్లు వేస్తున్నారని, అందులో భాగంగా నారు కొసలు తుంచి నాటుకుంటే, కాండం తొలుచు పురుగు నివారణ సాధ్యమవుతుందన్నారు. అంతేకాకుండా మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చున్నారు. అనంతరం స్థానిక సింగల్ విండో కార్యాలయానికి వెళ్లి కౌలు రైతులకు రుణాలు అందించాల్సిందిగా సీఈఓ ను కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ శివశంకర్, ఏఓ మురళీమోహన్

మానవజాతికి మణిహారం ఆడబిడ్డ

పీలేరు : మానవజాతికి ఆడబిడ్డ మణిహారమని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బోడుమల్లువారిపల్లెలో ×ఆడబిడ్డల రక్షణ – అందరి బాధ్యత૯ అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ, మగ ఇద్దరూ సమానమని వారి విద్య పట్ల, ఆహారం పట్ల, ఆరోగ్యంపట్ల వివక్షత చూపరాదని తెలిపారు. గర్భదారణ సమయంలో లింగ నిర్ధారణ చేసుకొని, తద్వారా ఆడ శిశువు అని తెలుసుకుని గర్భస్రావం చేసుకోవడం సరైంది కాదన్నారు. తద్వారా తీవ్ర అసమానతలు ఏర్పడి, సమాజాభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, ఏఎన్‌ఎం రేణుక, సీహెచ్‌వో రాజేశ్వరి, వెంకటరత్నం, నాగసుధ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

నిమ్మనపల్లె : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని ఎంపీడీఓ రమేష్ బాబు అన్నారు. మంగళవారం సర్పంచులు పంచాయితీ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా నిమ్మనపల్లి వారపు సంతలోని సంపద తయారీ కేంద్రం వద్ద గ్రామాల అభివృద్ధి, సంపద సృష్టి, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాలపై క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మూడు రోజులగా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమం (జిపిడిపి) పై శిక్షణా తరగతులను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, సుబ్రమణ్యం, మహదేవ రెడ్డి, ఉషారాణి, ఆర్ వరలక్ష్మి, చంద్రాయుడు, రెడ్డప్ప, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ

మదనపల్లె సిటీ: చిత్తూరు జిల్లా వీ.కోటలో ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా సబ్ జూనియర్ బాలికల జట్టు ద్వితీయ స్థానం, బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచినట్లు జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గౌతమి మంగళవారం తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులు, కోచ్ యూసుఫ్, మురళి,మేనేజర్ గురుప్రసాద్, సౌభాగ్యలను షూటింగ్‌బాల్ జిల్లా అధ్యక్షులు ఎస్వీ రమణారెడ్డి, ఉపాధ్యక్షులు రెడ్డిశ్రీనివాస్, రాయలసీమ షూటింగ్ బాల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ నరేష్‌బాబు, క్రీడాభారతి అధ్యక్షులు దిలీప్‌కుమార్‌లు అభినందించారు. కార్యక్రమంలో పీడీలు బాషా, మురళి, నాగరాజ్, సుజాత, కోచ్ ప్రదీప్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిచండి

తంబళ్లపల్లె: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు జ్వరాలు, అతిసారపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా నివారణాధికారి వేణుగోపాల్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన తంబళ్లపల్లెలో పర్యటించారు. డెంగీ బారిన పడిన చిన్నారుల ఆరోగ్యంపై ఆరా తీశారు. స్థానిక సిహెచ్‌సిలో వైద్యాధికారి డాక్టర్ వెంకటరామయ్యతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో డెంగీ బారిన పడినట్లు 98 మందికి నిర్ధారణ అయినట్లు తెలిపారు. డివిజనల్ స్థాయిలో 39 మందికి, తంబళ్లపల్లెలో ముగ్గురికి నిర్ధారణ అయినట్లు తెలిపారు. దోమల నివారణకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట డాక్టర్ రిచర్డ్స్,మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు ఉన్నారు.

కురబలకోటలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక

కురబలకోట: కురబలకోట మండల ఉపాధి హామీతో పాటు ఇతర శాఖల పనులపై మంగళవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక సభ నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.6.84 కోట్లతో జరిగిన వివిధ అభివృద్ధి పనులపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రజా వేదిక సభ నిర్వహించారు. మస్టర్లు సరిగ్గా నమోదు చేయకపోవడం, కొలతల్లో తేడా వల్ల రూ.20,297 రికవరీకి సహాయ పథక సంచాలకులు రవికుమార్ ఆదేశించారు. అలాగే మామిడి మొక్కలు, అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు తిరిగి నాటాలని సూచించారు. పని ప్రదేశాల వద్ద సమాచార బోర్డులు విధిగా ఏర్పాటు చేయాలన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో ఊరూరా తిరిగినా పెద్దగా అవినీతి, అక్రమాలు తేలకపోవడం విశేషం.

